సాక్షి ఖమ్మం

శనివారం : 30 : నవంబర్ : 2024



కుష్ఠు బాధితుల గుర్తింపునకు ..
కుష్ఠు వ్యాధి బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేలా వచ్చేనెల 2నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. 8లో



కమ్యూనిస్టుకు పర్యాయపదం..
ఇటీవల కన్నుమూసిన సీపీఐ నేత పోటు ప్రసాద్ కమ్యూనిస్టుకు పర్యాయపదంగా నిలిచారని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 23°

వాతావరణం
జిల్లాలో శనివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది. రాత్రికి మాత్రం చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

1నుండి 'అంబేద్కర్' యూనివర్సిటీ తరగతులు

ఖమ్మం సహకారనగర్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్లతో పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వచ్చేనెల 1నుంచి అధ్యయన తరగతులు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ప్రతీ ఆదివారం కళాశాలలో జరిగే తరగతులకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: 2024 విద్యాసంవత్సరం(ఫాల్ సీజన్)కు గాను విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మైనార్టీ అభ్యర్థులు విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ అధికారి కస్తాల సత్యనారాయణ సూచించారు. పీజీ, పీహెచ్‌డీ చదివేందుకు విదేశాలకు వెళ్లేవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ, పీజీల్లో 60 శాతం మార్కులు పొందిన వారు అర్హులని, డిసెంబర్ 1నుండి 31వ తేదీ లోపు ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కాపీని జనవరి 10వ తేదీలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

రూ.36 కోట్ల లాభాల్లో ఖమ్మం రీజియన్



డిపోలో పరిశీలిస్తున్న ఆర్‌ఎం సరిరామ్‌నాయక్

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ రూ.36 కోట్ల లాభాల్లో ఉందని.. రీజియన్ పరిధిలోని అన్ని డిపోలు లాభాల బాటలో పయనిస్తున్నాయని రీజినల్ మేనేజర్ సరిరామ్‌నాయక్ వెల్లడించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు శుక్రవారం సాయంత్రం వచ్చిన ఆయన బస్టాండ్, సైకిల్‌స్టాండ్, గ్యారేజీ, ఖాళీ స్థలాలను పరిశీలించడమే కాక రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ శబరిమలై వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉండగా, రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు నడిపిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం నింపేందుకు అన్ని డిపోల పరిధిలో వన భోజనాల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితి, సూపర్‌వైజర్లు సుబ్బారావు, కాంతారావు, బాలస్వామి, వీబీఓ కిన్నెర ఆనంద్, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ నారాయణ పాల్గొన్నారు.

అటవీ పార్క్ ఏర్పాటుకు రూ.80 లక్షలు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం పుణ్యక్షేత్రానికి భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. ఇందులో భాగంగా జమలాపురంలో అటవీ పార్కు ఏర్పాటుకు రూ.80లక్షల నిధులను కేటాయించారు. ఇదికాకుండా మరికొన్ని అభివృద్ధి పనులకు త్వరలో నిధులు విడుదల కానున్నాయని తెలుస్తోంది. కాగా, అటవీ పార్క్‌కు నిధులు మంజూరైన విషయాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకుడు మల్లెల లక్ష్మణ్‌రావు శుక్రవారం ఎర్రుపాలెంలో వెల్లడించారు.

రైతులకు ఆనందం | బోనస్..!

ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. జిల్లాలో 330 కేంద్రాలు ఏర్పాటుచేయగా ఇప్పటివరకు 4లక్షలకు పైగా క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు అంచనా. ఇందులో అత్యధికంగా సన్న రకాలే ఉండగా రైతుల ఖాతాల్లో మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ జమ అవుతోంది. శుక్రవారం నాటికి 5,736 మంది రైతుల ఖాతాల్లో రూ.19,11,86,00 బోనస్ జమ అయిందని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఈ రకాలు సాగు చేసిన అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- జిల్లాలో చకచకా ధాన్యం కొనుగోళ్లు
- కొనుగోలు కేంద్రాలకు అత్యధికంగా సన్నరకాలే...
- ఎప్పటికప్పుడు రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ జమ
- రబీలోనూ వరి సాగుకే మొగ్గు చూపుతున్న రైతాంగం



కాంటా పూర్తయిన ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు సిద్ధంచేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) రైతు ఖాతాలో బోనస్ అయినట్లు అందిన మెసేజ్

2.81లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలోని 17మండలాల మీదుగా సాగర్ కాల్వలు ప్రవహిస్తుండడం ఈ ఆయకట్టు పరిధిలో రైతులు ఏటా రెండు సీజన్లలోనూ వరి సాగుకే ప్రాధాన్యత ఇస్తారు. ఇక ఈ ఏడాది ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఈమేరకు జిల్లాలో 2,81,991 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాలు 2,62,230 ఎకరాలు కాగా, దొడ్డు రకాలు కేవలం 19,761ఎకరాల్లో సాగైంది. కాగా, ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ రకం(సన్నాలు) ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించింది. దీనికి తోడు సన్నరకాలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని వెల్లడించడంతో ఎక్కువ మంది రైతులు అటే మొగ్గు చూపారు.

వెంటవెంటనే మద్దతు ధర, బోనస్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తోడు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ కూడా జమ అవుతోంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించి కాంటా వేయించాక ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. ఆతర్వాత మిల్లులకు తరలిస్తుండగా ఒకటి, రెండు రోజుల్లోనే ఖాతాల్లో నగదు జమ అవుతుండగా రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు 5,736 మంది రైతుల ఖాతాల్లో బోనస్ రూ.19,11,86,00 జమ కాగా.. ఇందులో అత్యధికంగా కల్లూరు మండలంలో 1,19,236 క్వింటాళ్ల సన్న ధాన్యం అమ్మిన 1,630 మంది రైతులకు రూ.5,96,18,000 బోనస్ అందింది. అత్యల్పంగా కామేపల్లి మండలంలో ఒక్క రైతు మాత్రమే 54.8 క్వింటాళ్ల ధాన్యం విక్రయించగా రూ.27,400 బోనస్ జమ అయింది.

కేంద్రాలకు సన్నరకాలే...

జిల్లాలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు ఎక్కువగా సన్నరకాలే ధాన్యమే వస్తోంది. జిల్లాలో అత్యధికంగా ఈ రకాలే సాగు చేయడంతో కోతలు పూర్తికాగానే కేంద్రాలకు తీసుకొస్తున్నారు. దొడ్డురకాలు జిల్లాలో 20వేల ఎకరాల్లో కూడా సాగుచేయలేదు. దీంతో కేంద్రాలన్నీ సన్నరకం ధాన్యంతోనే పోటెత్తుతున్నాయి. ఈ ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా అటు మద్దతు ధర, ఇటు బోనస్ జమ అవుతుండడం విశేషం. కాగా, రైతుల ఖాతాల్లో బోనస్ జమ అయ్యాక సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్లతో సెల్ ఫోన్‌కు మెసేజ్ కూడా అందుతోంది.

రైతుల ఖాతాల్లోనే జమ



సన్న రకం ధాన్యం విక్రయించిన వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు బోనస్ చెల్లిస్తున్నాం. ఇప్పటి వరకు ధాన్యం అమ్మిన రైతుల్లో 5,736 మంది ఖాతాల్లో రూ.19కోట్లకు పైగా బోనస్ జమ అయింది. వీరు 3.82లక్షల క్వింటాళ్ల ధాన్యం అమ్మారు. మిగతా రైతుల ఖాతాల్లోనూ బోనస్ జమ అవుతుంది.

– శ్రీలత, డీఎం, పౌరసరఫరాల సంస్థ

చెరుకు వేయడం లేదు...



ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఖాతాలో జమ అయింది. 89 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రంలో విక్రయించా. రూ.44,500 బోనస్ అందింది. ఫోన్‌లో మెసేజ్ చూడగానే సంతోషం అనిపించింది. అందుకే ఇప్పుడు చెరుకు కాకుండా యాసంగిలోనూ వరి సాగు చేయాలని నిర్ణయించుకున్నా.

– మస్తాన్, రైతు, చెన్నారం

జిల్లా రైతులకు అందిన బోనస్ వివరాలు...	రైతులు	అమ్మిన సన్న ధాన్యం	జమ అయిన బోనస్
	5,736 మంది	3,82,372 క్వింటాళ్లు	రూ. 19,11,86,000

ఆ సెల్ ఎవరిది?

- నేలకొండపల్లి హత్యల కేసులో కీలకంగా కాల్ రికార్డ్
- చెత్తకుప్పలో దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో గత మంగళవారం రాత్రి దంపతులు ఎర్రా వెంకటరమణ – కృష్ణకుమారి హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపగా.. ప్రత్యేక పోలీసు బృందాల విచారణ కొనసాగుతోంది. అయితే, ఇప్పటివరకు మిస్టరీ వీడకపోగా శుక్రవారం కీలక ఆధారంగా భావిస్తున్న సెల్‌ఫోన్ పోలీసుల చేతికి చిక్కినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ డేటాతో పాటు ఫోన్ లభించిన ప్రాంతానికి సమీపాన ఉన్న షాపు నుంచి సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించడంతో దర్యాప్తులో అడుగు ముందుకు పడినట్లు భావిస్తున్నారు.

చెత్త కుప్పలో ఫోన్

నేలకొండపల్లిలో పెట్రోల్ బంక్ ఎదురుగా గ్రామపంచాయతీ స్వీపర్ శుక్రవారం ఉదయం చెత్త తొలగిస్తుండగా ఓ చోట సెల్‌ఫోన్ లభించింది. దీంతో ఆమె స్థానిక పోలీసులకు అప్పగించింది. ఈ విషయం తెలియగానే ప్రత్యేక బృందాలు సైతం సదరు స్వీపర్ ఇంటికి సైతం వెళ్లి విచారించారు. అంతేకాక సెల్‌ఫోన్ దొరికిన ప్రాంతంలో ఓ దుకాణం నుంచి సీసీ కెమెరాల ఫుటేజీ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్ నిందితులు పారిపోయే క్రమంలో కింద పడిందా, లేక మృతుల ఫోన్‌ను తీసుకెళ్లే క్రమాన వదిలేశారా అనే విషయాన్ని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తుండగా స్పష్టత ఇవ్వడం లేదు. హంతకుల ఫోన్ అయితే హత్య జరిగిన రోజే లభించేదని, రెండు రోజుల తర్వాత దొరకడంతో నిందితులు మళ్లీ ఇక్కడకు వచ్చి, వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యాన సెల్‌ఫోన్ కాల్‌డేటా, సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తులో వేగం పెంచినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్‌తో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు శుక్రవారం సైతం మండల కేంద్రంలో పర్యటించి పలువురు అనుమానితులను విచారించినట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా సెల్‌ఫోన్ దొరికిన మాట వాస్తవమేనని చెప్పినా ఇతర వివరాలు వెల్లడించేందుకు మాత్రం నిరాకరించారు.

జీపీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్

వచ్చేనెల 7న ముసాయిదా.. 17న తుది జాబితా

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఒక్కటొక్కటిగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాలు సిద్ధం చేయగా.. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా, మండల అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ సజావుగా సాగేలా భవనాలు అనువుగా ఉన్నాయా లేదా, అన్నది నిర్ధారించాల్సి ఉంటుంది. ఆపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అనుమతితో పోలింగ్ కేంద్రాలను ప్రకటించనున్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం వచ్చే నెల 6వ తేదీన పోలింగ్ కేంద్రాల జాబితాను కలెక్టర్‌కు సమర్పించాలి. ఆతర్వాత 7వ తేదీన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను ఎంపీడీఓలు ప్రచురించనున్నారు. ఈ అంశంపై డిసెంబర్ 10న జిల్లాస్థాయిలో, 12న మండల స్థాయిలో పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. అంతేకాక 7వ తేదీ నుండి 12వ తేదీ వరకు కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించనుండగా డిసెంబర్ 17న కేంద్రాల తుది జాబితాను ప్రకటించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత వెల్లడించారు.

సీనియర్ సిటిజన్లకు మెరుగైన వైద్యం

- ప్రతీ శుక్రవారం పెద్దాస్పత్రిలో ప్రత్యేక క్లినిక్
- వైద్యసేవలను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



చికిత్స కోసం వచ్చిన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: వయోవృద్ధులకు జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక ప్రాధాన్యతతో అన్ని వైద్యసేవలు ఒకే చోట అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్యసేవల విభాగాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్యసేవలు, వసతులపై ఆరాతీశాక మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే వయోవృద్ధులకు ప్రత్యేక విభాగం ద్వారా అన్ని వైద్యసేవలు అందించాలని, వారి కోసం హెల్పర్లను నియమించి చక్రాల కుర్చీలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతీ శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తున్న విషయమై అవగాహన కల్పించాలని తెలిపారు. వృద్ధులను అన్ని విభాగాలకు తిప్పకుండా ఒకేచోట సేవలు అందించాలని, అవసరమైతే ఔట్ సోర్సింగ్ ద్వారా సిబ్బంది నియామకానికి ప్రతిపాదించాలని సూచించారు. కాగా, ఫార్మసీ ఇంటర్న్‌షిప్ కింద విధులు నిర్వహించే విద్యార్థులకు కూడా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిరతో పాటు వైద్యులు, సిబ్బంది సోమ్లానాయక్, పద్మావతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

1, 2న ప్రజా విజయోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు

ఖమ్మం సహకారనగర్: ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను డిసెంబర్ 1, 2వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 1న పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట చౌరస్తా వద్ద టీ.సీ.వీ.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో, 2న మధిరలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కళారూపాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వం వాగ్దానాలను అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే కాక ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలపై కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడమే కాక వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడాలన్నారు. అలాగే, ఉపాధిహామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపజేయాలని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ దొడ్డు రకం బియ్యానికి సైతం రూ.500 బోనస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని అర్హులందరికీ ఇవ్వాలని కోరారు. కాగా, వచ్చేనెల 18, 19న సత్తుపల్లిలో జరగనున్న పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, వై.విక్రమ్ తదిరులు పాల్గొన్నారు.

ఉద్యమం ఎగిసిపడింది ఇక్కడే...

- కేసీఆర్ పోరాటంతోనే స్వరాష్ట్ర సాధన
- దీక్షాదివస్ సభలో మాజీ మంత్రి పువ్వాడ



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీలు మధు, రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, చంద్రావతి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఏర్పాటుచేయాలనే డిమాండ్‌తో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగితే అప్పటి పాలకులు ఆయనను ఖమ్మం జైలుకు తీసుకొచ్చారని.. ఆ సమయాన ఇక్కడి ప్రజలు భుజాలకు ఎత్తుకోవడంతో ఉద్యమం ఊపందుకుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజును గుర్తుచేసుకునేలా శుక్రవారం ఖమ్మంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన దీక్షా దివస్ నిర్వహించారు. తొలుత భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా.. మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి తదితరులు తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అలాగే, బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పువ్వాడ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం కేసీఆర్ దీక్షకు దిగడంతోనే రాష్ట్రాన్ని సాధించుకోగలిగామని తెలిపారు. ఆనాడు కేసీఆర్‌కు సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు మద్దతు ఇచ్చాయని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ హయాంలో అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ తప్పుడు హామీలతో అధికారం చేపట్టడమే కాక ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్సీలు మధు, రవీందర్‌రావు మాట్లాడుతూ ఎక్కడా హింసకు తావు లేకుండా ఉద్యమాన్ని నడిపించిన కేసీఆర్‌ను తెలంగాణ ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో వనభోజనాల సందడి..

- ఉద్యోగులకు ఒత్తిడి తగ్గించేలా నిర్వహణ
- ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలకూ ఆహ్వానం
- రీజియన్‌లోని మూడు డిపోల్లో పూర్తి



కొత్తగూడెంలో భోజనం చేస్తున్న ఉద్యోగులు



ఆటల పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడమే కాక ఉత్తేజాన్ని నింపేలా సంస్థ వన భోజనాలకు శ్రీకారం చుట్టింది. ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల వారీగా వన భోజనాలు నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులను సైతం ఆహ్వానిస్తున్నారు. ఉత్తమ ఉద్యోగులను సన్మానించడంతో పాటు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తుండడంతో సందడి నెలకొంది.

విధులతో సతమతం

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, డిపోల్లో పనిచేసే ఉద్యోగులు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే. లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే క్రమాన ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా ఇబ్బందులు ఎదురవుతాయి. అంతేకాక మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక బస్సుల్లో రద్దీ పెరగడంతో డ్రైవర్లు, కండక్టర్లతో పాటు డిపోల్లోని ఉద్యోగులు మరింత ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబీకులకు ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించింది. ఇక విధుల్లో తీరిక లేక కార్తీకమాసంలో కులాలు వారీగా, కాలనీల్లో నిర్వహించే వనభోజనాలకు హాజరయ్యే పరిస్థితి ఉండడం లేదు. దీంతో డిపోల వారీగా వనభోజనాలు నిర్వహిస్తుండడం ఉద్యోగులకు ఊరట కలిగిస్తోంది.

ఒకే కుటుంబం..

డిపోలో ఉద్యోగులంతా కులమతాలకతీతంగా ఒకే కుటుంబమని చాటేలా వనభోజనాలకు శ్రీకారం చుట్టారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర ఉద్యోగులు వారి కుటుంబాలతో సహా ఒకేచోట గడిపితే సత్సంబంధాలు మెరుగుపడతాయని యాజమాన్యం భావిస్తోంది. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపే అవకాశం కల్పిస్తే రెట్టించిన ఉత్సాహంతో విధులకు హాజరవుతారని చెబుతున్నారు. ఈనేపథ్యాన మధిర, కొత్తగూడెం, ఇల్లెందు డిపోల్లో ఇప్పటికే పూర్తయ్యాయి. ఇక డిసెంబర్ 1న సత్తుపల్లి, 3న ఖమ్మం, 4న భద్రాచలం, 5న మణుగూరు డిపోలో వనభోజనాలు ఏర్పాటుచేయనున్నారు.

డిపోల వారీగా నిర్వహిస్తున్నాం..



ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలు ఉండగా.. ఆయా డిపోల పరిధిలో వన భోజనాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉద్యోగులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనలకు హాజరయ్యేలా ప్రణాళికలు చేస్తున్నాం. ఆర్టీసీ సిబ్బంది తమ కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులతో కలిసి వనంలో గడిపేలా చూస్తున్నాం.

– ఏ.సరిరామ్, రీజినల్ మేనేజర్

నిధులు కేటాయింపు..

ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది వన భోజనాల కోసం సంస్థ నిధులు కేటాయించింది. ఒక్కో ఉద్యోగికి రూ.300 చొప్పున డిపోల వారీగా విడుదల చేశారు. ఉద్యోగితో పాటు వారి కుటుంబ సభ్యులకు భోజనం పెట్టేందుకు ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. కాగా, వన భోజనాలకు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందితో పాటు అద్దె బస్సుల డ్రైవర్లను సైతం ఆహ్వానిస్తున్నారు.

క్లుప్తంగా

క్రీడలకు సైతం ప్రాధాన్యత ఇవ్వాలి



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు చదువుకుంటూనే క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జిల్లా బాలికలు పతకాలు సాధించారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్‌ను కలవగా ఆయన అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కె.ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి టీ.టీ. టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నుంచి రెండో రోజుల పాటు ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. అండర్-11 నుంచి సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు బాలసాని విజయ్‌కుమార్, వీ.వీ.సాంబమూర్తి తెలిపారు. అలాగే, బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు శుక్రవారం నుంచి మొదలయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఇటీవల కళాశాలల యజమాన్యాలు బంద్ పాటించిన విషయం విదితతే. ఆతర్వాత ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్చించడంతో కళాశాలలను తెరవగా 26నుంచే జరగాల్సిన డిగ్రీ పరీక్షలను రీ షెడ్యూల్ చేశారు. దీంతో శుక్రవారం నుంచి పరీక్షలు మొదలయ్యాయని అధికారులు తెలిపారు.

2నుంచి 'ఇగ్నో' పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) పరీక్షలు వచ్చే నెల 2వ తేదీ నుంచి జరగనున్నాయని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల సెంటర్ కోఆర్డినేటర్ కే.వీ.రమణారావు తెలిపారు. వివిధ కోర్సుల అభ్యర్థులకు డిసెంబర్ 2నుంచి జనవరి 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షలకు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మిర్చి తోటలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో రైతులు సాగు చేసిన మిర్చి తోటలను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య మిర్చిని పరిశీలించి కొమ్మ కుళ్ల తెగులు ఉధృతి ఉందని గుర్తించారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, లద్దె పురుగు నివారణకు తవుడులో క్లోరిపైరిఫాస్, బెల్లం తగినంత మోతాదులో కలిపి గుళికలుగా చేసి చల్లాలని, పెద్ద పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక పూత, పిందె దశలో మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందజేయాలని సూచించారు. నల్ల తామర పురుగులు కనిపిస్తే నీలి రంగు జిగురు అట్టలను ఎకరానికి 15 నుంచి 20 వరకు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ బాలాజీ , ఏఈఓ సరిత పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు నిర్వహించని సింగరేణి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ నెలలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థలో పనిచేస్తూ అనారోగ్యానికి గురైన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రతినెలా సింగరేణి ప్రధానాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులను గుర్తిస్తున్నారు. అయితే వందల సంఖ్యలో దరఖాస్తులు ఉన్నా ఈ నెలలో మెడికల్ బోర్డ్ నిర్వహించకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నెలకు మూడుసార్లు మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించి, సుమారు 600 మందిని అన్‌ఫిట్ చేశారని, ఆ తర్వాత నెలకు రెండు సార్లు నిర్వహించారని పేర్కొంటున్నారు. ఈ నెలలో ఒక్కసారి కూడా మెడికల్ బోర్డు నిర్వహించ లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,144

కుష్ఠు బాధితుల గుర్తింపునకు సర్వే

డిసెంబర్ 2 నుంచి ఇంటింటికీ సిబ్బంది

- రెండు వారాల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేసేలా కార్యాచరణ
- వ్యాధి తీవ్రత ఉన్న జిల్లాల జాబితాలో ఖమ్మం



పోస్టర్ల ద్వారా కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు బాధితుల గుర్తింపునకు వచ్చే సోమవారం నుండి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. వచ్చేనెల 2 నుండి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుండగా గ్రామాలు, వార్డుల వారీగా ఏఎన్ఎం పర్యవేక్షణలో ఆశ, వాలంటీర్ సర్వేలో పాలుపంచుకుంటారు. ఇలా బృందం తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా మచ్చలు ఉన్నాయా, అవి ఏ రకమో పరీక్షిస్తారు. సదరు ఇంట్లో అందరినీ పరీక్షిస్తే ఇంటికి 'ఎల్' అని, ఇంకా ఎవరైనా మిగిలితే 'ఎక్స్' అని గుర్తు పెడతారు. ఆయా బృందాలు గుర్తించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయనుండడంతో కుష్ఠు వ్యాధి బాధితుల సమాచారం పక్కాగా తెలిసి పోతుంది. తద్వారా సిబ్బంది నేరుగా వారి ఇళ్లకు వెళ్లి మందులు ఇచ్చే అవకాశం ఏర్పడుతుంది.

మొదటి దశలోనే గుర్తించేందుకు...

కుష్ఠు వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స చేయడం సులువవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యాన సర్వేకు సిద్ధం కాగా.. ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన కొన్నాళ్లుగా మైక్‌లు, కరపత్రాల ద్వారా సర్వేపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలల్లోనూ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 2027 నాటికి దేశాన్ని కుష్ఠు రహితంగా మార్చాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించగా.. ఇంటింటి సర్వే ద్వారా బాధితులను గుర్తించి చికిత్స చేయనున్నారు.

కుష్ఠు వ్యాధి అంటే...

కుష్ఠు వ్యాధి సూక్ష్మ క్రిమి వల్ల చర్మం, నరాలకు సోకుతుంది. నెమ్మదిగా పెరుగుతూ వ్యాధి లక్షణాలు బయటపడడానికి సగటున మూడేళ్ల నుంచి ఐదేళ్ల సమయం పడుతుంది. ఈ వ్యాధి వయస్సు, లింగభేదం లేకుండా ఎవరికైనా వస్తుందే తప్ప వంశపారంపర్యంగా సోకదు. బహుళ ఔషధ చికిత్సతో తీవ్రత ఆదారంగా ఆరు నెలల నుంచి ఏడాదిలోపు నయం చేసేలా చికిత్స అందుబాటులో ఉంది.

ఇక కుష్ఠు వ్యాధిని రెండు రకాలుగా వర్గీకరిస్తారు.మొదటిది పాసీ బేసిలరీ లెప్రసీ(పీబీ). ఈ రకంలో శరీరంపై ఒకటి నుండి ఐదు మచ్చలు ఏర్పడడమే కాక ఒక నరానికి సోకుతుంది. రెండో రకంలో శరీరంపై మచ్చలు ఆరు కంటే ఎక్కువగా ఏర్పడడమే కాక ఒకటి కంటే ఎక్కువ నరాలకు సోకుతుందని అధికారుల వెల్లడించారు. కాగా, కుష్ఠు వ్యాధి సోకిన వారి చర్మంపై సహజ చర్మపు రంగు కంటే తక్కువ, ఎరుపు లేదా రాగి రంగు మచ్చలు ఉంటాయి. ఆ మచ్చపై స్పర్శ కానీ నొప్పి కానీ ఉండదు.

జిల్లాలో కొన్నేళ్లుగా నమోదైన కుష్ఠు కేసులు

ఏడాది	కేసులు
2020-21	82
2021-22	79
2022-23	116
2023-24	63
2024-25	75

చికిత్స విధానం...

కుష్ఠు వ్యాధి రెండు లేక మూడు ఔషధాల కలయికతో కూడిన బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) ద్వారా పూర్తిగా నయమవుతుంది. అయితే, ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించడం, వ్యాధి సోకిన వారికి పూర్తి ఎండీటీ చేయించడమే కీలకం. ఎండీటీ చికిత్స అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిగా ఉచితంగా లభిస్తుంది.

అనుమానం వస్తే..

కుష్ఠు వ్యాధి సోకినట్లు అనుమానం వస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో సంప్రదించాలి. వ్యాధి తొలి దశలో గుర్తిస్తే ఆరు నెలలు, తీవ్రత ఉంటే ఏడాది పాటు సక్రమంగా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అంగవైకల్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు. కాగా, అర్హులైన కుష్ఠు బాధితులకు పాదరక్షలు ఉచితంగా అందిస్తుండగా, అంగవైకల్యం ఏర్పడినవారికి ఉచిత శస్త్రచికిత్స చేయించడంతో పాటు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం కూడా అందిస్తున్నారు.

ఈ ఏడాది 75 కేసులు నమోదు

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 75 కుష్ఠు కేసులు నమోదయ్యాయి. గత ఏడాది 63 కేసులు నమోదు అయ్యాయి. కొన్నేళ్లుగా జిల్లాలో వ్యాధి వ్యాప్తి చెందుతండగా, తిరుమలాయపాలెం మండలంలో తీవ్రత ఉందని చెబుతున్నారు. అలాగే, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లోనూ బాధితులు ఉన్నారు. ప్రజల్లో అవగాహన లేమితోనే వ్యాధి వ్యాపిస్తోందని అంచనా. కాగా, జిల్లాలో కుష్ఠు వ్యాధి వ్యాప్తి దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చింది. కేంద్రం లక్ష్యాల మేరకు 2027 నాటికి వ్యాధిని రూపుమాపేలా అధికారులు కృషి చేస్తున్నారు.

వంద శాతం సర్వే చేపడుతాం..



కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించేందుకు వంద శాతం ఇళ్లలో సర్వే చేస్తాం. రెండు వారాలపాటు ఆశా, వాలంటీర్ ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి శరీరంపై మచ్చలు ఉన్నాయా అని పరీక్షిస్తారు. సర్వే తర్వాత బాధితుల గణాంఆలపై స్పష్టత వస్తుంది. ఆపై మందులు పంపిణీ చేస్తూ కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.

– కళావతిబాయి, డీఎంహెచ్ఓ

కమ్యూనిస్టుకు పర్యాయపదం పోటు ప్రసాద్..

- సంతాప సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- మమత మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత



పోటు ప్రసాద్ పాడె మోస్తున్న కూనంనేని, బాగం హేమంతరావు తదితరులు



ప్రసాద్ మృతదేహం వద్ద ఆయన కుమారుడు, తల్లి, సతీమణి

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టుకు పర్యాయపదంగా నిలవడమే కాక పేదలకు ఆసరాగా నిలిచిన పోటు ప్రసాద్ చిరస్థాయిగా నిలిచి ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఇటీవల మృతి చెందగా ఆయన సంతాప సభ శుక్రవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం నిస్తేజంలో ఉన్నప్పుడు ఆయన స్ఫూర్తిని రగిలించారని చెప్పారు. చాలామంది కమ్యూనిస్టుగా జీవించాలని ఆశపడేలా, తాపత్రయపడేలా ఆయన జీవితం సాగిందని చెప్పారు. అనంతరం రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తన సోదరుడు ఉదయ్‌కుమార్, పోటు ప్రసాద్ కలిసి ప్రతిభ ప్రజ్ఞ కళాశాలను స్థాపించారని, 42ఏళ్లు తామంతా జట్టుగా పనిచేశామని గుర్తు చేశారు. కాగా, ప్రసాద్ మరణంతో తన తండ్రి నాగేశ్వరరావు దిగ్భ్రాంతికి గురయ్యాని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కష్టకాలంలో కమ్యూనిస్టులకు దన్నుగా నిలిచి ఉద్యమ వ్యాప్తికి కృషి చేసిన వారిలో పోటు ప్రసాద్ ఒకరని తెలిపారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మాట్లాడగా వివిధ పార్టీల నాయకులు ఎస్.బాలమల్లేష్, బాగం హేమంతరావు, దండి సురేష్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్, పాకాలపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ మౌలానా, నున్నా నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, వాసిరెడ్డి రామనాథం, వాసిరెడ్డి సీతారామయ్య, విజయ్‌కుమార్, ఎస్.కే.షాబీర్ పాషా, తుళ్లూరి బ్రహ్మయ్య, జమ్ముల జితేందర్ రెడ్డి, జానీమియా, సిద్దినేని కర్ణకుమార్, రామకృష్ణ, పుట్టా లక్ష్మణ్, ఆరికె తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలుకు కదలిన జనం

పోటు ప్రసాద్ వీడ్కోలు సభకు రాష్ట్ర నలుమూలల నుంచి కమ్యూనిస్టు పార్టీల నాయకులే కాక ఇతర పార్టీలు, సంఘాల బాధ్యులు హాజరయ్యారు. ఆయన అంతిమయాత్ర సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద మొదలుకాగా, ప్రసాద్ 64ఏళ్ల వయస్సుకు సంకేతంగా 64 ఎర్ర జెండాలతో పార్టీ శ్రేణులు ముందు నడిచారు. అనంతరం వివిధ ప్రాంతాల మీదుగా సాగిన ర్యాలీ మమత మెడికల్ కళాశాలకు చేరుకుంది. అక్కడ మమత వైద్య విద్యాసంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీకి పోటు ప్రసాద్ కుమారుడు సాత్విక్, తల్లి సక్కుబాయి, సతీమణి నిర్మల, సోదరి పోటు కళావతి తదితరులు ప్రసాద్ మృతదేహాన్ని అప్పగించారు.

ముగిసిన అజ్ఞాత దళాల ప్రస్థానం

- ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రమేశన్న అరెస్టును ప్రకటించిన పోలీసులు
- 1967లో పగిడేరులో ప్రారంభమైన ఆత్మరక్షణ దళాలు



ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రమేశ్ అరెస్టును ప్రకటిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: సీపీఎం నుంచి విడిపోయిన ఎంఎల్ గ్రూపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరులో 1967లో ఆత్మరక్షణ దళాలుగా అవతరించింది. అప్పటి నుంచి అజ్ఞాత దళాల ప్రస్థానం మొదలుకాగా ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురంలో ప్రస్తుతం ముగిసింది. అజ్ఞాతంలో ఉన్న ఏకైక నేత, సీపీఐ (ఎంఎల్) ఎన్‌డీ (వైకే) భద్రాద్రి జిల్లా కార్యదర్శి పూనెం బాబు అలియాస్ రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ ఎల్లాపురంలోని స్వగృహానికి వచ్చినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకోగా అరెస్ట్‌పై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో పార్టీ శ్రేణులు, కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యాన రమేశన్నను కాచనపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను శుక్రవారం ఇల్లెందులో ప్రకటించారు. ఈ సమావేశంలో గుండాల సీఐ రవీందర్, కాచనపల్లి ఎస్ఐ సోమేశ్వర్ పాల్గొన్నారు. కాగా, ఆయన 2013 నుంచి అజ్ఞాతంలో ఉండగా, వ్యాపారులు, అటవీ ఉద్యోగులను బెదిరించిన ఘటనల్లో ఆయనపై ఆరు కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వెల్లడించారు.

వర్గాలుగా ఎన్‌డీ...

1967లో పగిడేరులో పుట్టిన ఎంఎల్ వర్గం క్రమంగా చీలిపోయింది. అంతిమంగా ఇల్లెందు మండలంలో మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురంలో ఎన్‌డీ (వైకే) వర్గం ప్రస్థానం ముగిసింది. ఆనాడు చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో ఆయుధాలు పట్టగా.. ఆ తర్వాత ఎంఎల్‌లో అనేక గ్రూపులు అవతరించినా ఏకైక అజ్ఞాత నేతగా ఉన్న రమేశ్ అరెస్ట్‌తో దళాల చరిత్ర ముగిసిపోయినట్లయింది. ఎంఎల్‌లో ప్రజాపంథా, న్యూడెమోక్రసీ వైకే వర్గం, చంద్రన్న వర్గం, ప్రతిఘటన, ప్రజాప్రతిఘన, గోదావరి లోయ ప్రజాప్రతిఘటన, జనశక్తి, సీపీయూఎస్ఐ, సీపీబాట, ఆదివాసీ లిబరేషన్ ఫ్రంట్, విమోచన ఇలా ఎన్నో గ్రూపులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లి దళాల నిర్మాణం చేపట్టే వారెవరూ లేరనే చెబుతున్నారు. అంతేకాక అజ్ఞాత దళాల సంచారానికి ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అటవీ ప్రాంతం అనుకూలంగా లేకపోవడం, అన్నిచోట్ల సెల్‌ఫోన్ల సిగ్నల్స్ విస్తరించడంతో క్షణాల్లో దళాల కదలికలు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యాన అజ్ఞాత దళాల మనుగడ కష్టమని భావిస్తున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రుద్రహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని యాగశాలలో రుద్రహోమం, పంచామృతాభిషేక పూజలు జరిపారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజల అనంతరం రుద్రహోమం గావించారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

'విప్లవ సమరోత్సాహంతో పీఎల్‌జీఏ వార్షికోత్సవాలు'

చర్ల: వచ్చేనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 24వ వార్షికోత్సవాలను విప్లవ సమరోత్సాహంతో జరపాలని మావోయిస్టు పార్టీ నేత ఆజాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధన కోసం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ ఏర్పడి 24 ఏళ్లు నిండనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యాన పట్టణ, మైదాన పాంతాల్లో వార్షికోత్సవం నిర్వహించాలని కోరారు. ఈ క్రమంలో ఏడాది కాలంలో ప్రాణాలు కోల్పోయిన 200 మందికి విప్లవ జోహార్లు అర్పించాలని సూచించారు. అంతేకాక కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించి గెరిల్లా పోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఆజాద్ పిలుపునిచ్చారు.

వద్దిపేట సమీపాన బ్యానర్

వచ్చేనెల 2 నుంచి మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను నిర్వహించాలని కోరుతూ మావోయిస్టులు వద్దిపేట – పూసుగుప్ప గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శుక్రవారం బ్యానర్ కట్టారు.

భోజనాన్ని హెచ్‌ఎంలు పర్యవేక్షించాలి



కారేపల్లి : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం సమకూర్చాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. అంతేకాకుండా భోజనాన్ని ప్రతిరోజు హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని తెలిపారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తయారీ షెడ్, బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించడమే కాక విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో సమస్యలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ సురేందర్, ఎంఈఓ జయరాజు, ఎంపీఓ రవీంద్రప్రసాద్, డీటీ లక్ష్మి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్యామ్, పంచాయతీ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కామేపల్లి: ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. మండలంలోని ముచ్చర్ల, కొత్తలింగాలల్లో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద ఏర్పాటు చేసిన నూడుల్స్ తయారీ యూనిట్, పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలించి నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. ఐకేపీ ఏపీఎం సురేంద్రబాబుతో పాటు వీరభద్రం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. వచ్చేనెల 1 నుండి 9వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాల్లో ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొని ప్రజలకు పథకాలను వివరించాలన్నారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా బూత్‌స్థాయి నుండి కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యతో పాటు మొక్కా శేఖర్‌గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, ఎర్రం బాలగంగాధర తిలక్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, రఘుపతిరెడ్డి, బోజెడ్ల సతీష్, కళ్లెం వెంకటరెడ్డి, బాలాజీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై కత్తితో దాడి చేసిన భార్య

కుటుంబ కలహాల నేపథ్యాన ఘటన



రవిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

వైరారూరల్: వైరా మండలంలోని గొల్లపూడిలో కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తిపై ఆయన భార్య కత్తితో దాడి చేసింది. మద్యం తాగి విధులకు వెళ్లి ఉద్యోగం కోల్పోయినా ఆయన తీరు మారకపోగా గొడవ పడుతుండడంతో క్షణికావేశంలో ఆమె ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఎస్సై ఏ.వంశీకృష్ణ తెలిపిన వివరాలు... గొల్లపూడికి చెందిన పారాశ్ల రవికి రెబ్బవరానికి చెందిన లక్ష్మితో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరగగా వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. రవి విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తూ ఆరు నెలల క్రితం మద్యం సేవించి విధులకు వెళ్లడంతో అధికారులు తొలగించారు. అప్పటి నుండి రవి ఖాళీగా ఉంటున్నాడు. ఆయన భార్య లక్ష్మి వైరాలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ చూస్తోంది. అయితే, ఖాతాలో ఉన్న డబ్బును(ఫోన్‌పే ద్వారా) మద్యానికి ఖర్చు చేస్తున్నాడని రవి సెల్‌ఫోన్‌ను శుక్రవారం ఉదయం ఆయన భార్య తీసుకుంది. దీంతో రవి ఆమెపై దాడి చేయడంతో కోపోద్రిక్తురాలైన లక్ష్మి క్షణికావేశంలో కత్తితో దాడి చేసింది. ఈ ఘటనలో ఆయనకు పలుచోట్ల గాయాలై రక్తస్రావం జరగడంతో ఎస్సై సిబ్బందితో చేరుకుని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై లక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్లు సీజ్

ఎర్రుపాలెం: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచల గ్రామం నుండి ఎర్రుపాలెం మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. ఉచిత ఇసుక పేరుతో స్టిక్కర్లు వేసిన టిప్పర్లు ఎర్రుపాలెం చేరుకున్నాయి. తనిఖీల్లో భాగంగా ఇసుక తరలింపునకు అనుమతి లేదని తేలడంతో వాహనాలను సీజ్ చేశామని ఎస్సై పి.వెంకటేశ్ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ ప్రాంతం మీదుగా నడిచి వెళ్తున్న మహిళ మెడ నుంచి దుండగుడు బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసే వెల్ది నాగమణి ట్యాంక్ బండ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె వెంట వచ్చాడు. ఒక్కసారిగా ఆమె మెడలో గొలుసు లాక్కుని పరారవడంతో బాధిత ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ములకపాడులో విద్యుత్ తీగ...

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం వద్ద విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన వైరును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. వైద్యశాల ప్రాంగణంలోని విద్యుత్ స్తంభం నుంచి ఇండోర్ స్టేడియానికి విద్యుత్ సరఫరా నిమిత్తం వైరును ఏర్పాటు చేశారు. కాగా గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 200 మీటర్ల విద్యుత్ వైరును కత్తిరించి చోరీ చేశారు.

అప్పు చెల్లించాలని ఆందోళన

ఖమ్మంక్రైం: రెండేళ్ల క్రితం తీసుకున్న నగదు చెల్లించడం లేదని ఖమ్మం వీడీఓస్ కాలనీలోని ఓ ఫైనాన్స్ వ్యాపారి ఇంటి ఎదుట శుక్రవారం నగరానికే చెందిన ఓ కుటుంబీకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. రెండు సంవత్సరాల క్రితం సదరు వ్యాపారి వడ్డీ కోసమని తమ వద్ద రూ.2.20కోట్లు తీసుకోగా వడ్డీ కానీ అసలు కాని చెల్లించడం లేదని వారు ఆరోపించారు. డబ్బు చెల్లించకపోతే తమ ఆత్మహత్యే శరణ్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డబ్బులు అడిగితే కులం పేరుతో దూషిస్తున్నారని వారు తెలిపారు.

శబరిమలలో జిల్లా వాసి మృతి



సీహెచ్.వెంకన్న (ఫైల్)

నేలకొండపల్లి: అయ్యప్పస్వామి దర్శనానికి శబరిమల వెళ్లిన ఓ భక్తుడు అక్కడ అనారోగ్యానికి గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం చెన్నారానికి చెందిన సీ.హెచ్.వెంకన్న(32) గ్రామంలోని మరికొందరితో కలిసి మంగళవారం ఇరుముడి కట్టుకుని శబరిమల వెళ్లాడు. అక్కడ గురువారం స్వామిని దర్శించుకుని కిందకు దిగారు. అయితే, వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వెంకన్న అస్వస్థతకు గురికాగా, రక్త విరోచనాలతో ఇబ్బంది పడ్డాడు. సహచర భక్తులకు చెప్పగా వారు వైద్యం చేయించినా ఫలితం లేక దేవస్థానం అధికారులు కొట్టాయంలోని ప్రధాన ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. వెంకన్నకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉండగా ఆయన మృతి సమాచారంతో అందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్లుప్తంగా...

పీఎస్ అథెంటికేషన్ దుర్వినియోగం కావొద్దు

డీఆర్డీవోలకు సెర్ప్ సీఈవో ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: చేయూత పింఛన్ల పంపిణీలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు 'పీఎస్ అథెంటికేషన్'ద్వారా మంచానికే పరిమితమైన వారు, బయోమెట్రిక్ ఫెయిలైన వ్యక్తులకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేసేలా చూడాలని డీఆర్డీవోలను.. గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో డి.దివ్య ఆదేశించారు. వీరికి కాకుండా ఇతరులకు ఈ పద్ధతి ద్వారా పింఛన్లు అందించినట్టు తేలితే కఠినచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పింఛన్ల అందజేత సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఈ విషయంలో స్పష్టంగా ఉన్నాయన్నారు. శుక్రవారం ఈ మేరకు డీఆర్డీవోలకు దివ్య లేఖ రాశారు. ఈ విషయంలో కచ్చితమైన మార్గదర్శకాలున్నా.. కొందరు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు తమ పీఎస్ అథెంటికేషన్ ద్వారా ఇతరులకు కూడా పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఆర్థికపరమైన అవకతవకలకు దారితీసే అవకాశముందన్నారు. పీఎస్ అథెంటికేషన్ చెల్లింపునకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు విడిగా ఓ అక్విటెన్స్ రిజిస్టర్‌ను మెయింటెయిన్ చేయాలని, అందులో పింఛనుదారుల సంతకాలు లేదా వేలిముద్రలు నమోదుచేయాలని ఆదేశించారు.

ఐటీ ఉద్యోగాలపై ప్రత్యేక ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ అవేర్‌నెస్ ప్రోగ్రాం పేరిట నాలుగు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీవీసీ (పాటానిక్స్ వ్యాలీ కార్పొరేషన్), టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్), ఏఎస్ఐపీ(అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్), టీ-సాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ అండ్ ట్రైనింగ్) సంయుక్తంగా డిజైన్ చేసిన కోర్సులను ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. వీఎల్ఎస్ఐపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నవంబర్ 30 ఉదయం 10 గంటలకు తెలంగాణ ఐటీ కమ్యూనికేషన్ల శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా ప్రారంభిస్తారని తెలిపారు. ప్రసారాలు ఉదయం 10 గంటలకు టీ-సాట్ నిపుణ చానల్‌లో.. ఆదివారం సాయంత్రం విద్యా చానల్‌లో 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రసారమౌతాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇదేవిధంగా కొనసాగే షెడ్యూల్‌ను యువత గుర్తించాలని సీఈవో సూచించారు.

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

- గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు తీర్పు... నిందితులపై నేరాన్ని నిరూపించలేకపోయిన ప్రాసిక్యూషన్
- తీర్పు వెలువడగానే కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..
- న్యాయం జరగలేదని.. గంగలో దూకడమే శరణం అంటూ ఆవేదన
- అన్ని ఆధారాలు సమర్పించాం.. అయినా కేసు కొట్టేశారు
- తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం.. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం.. పోలీసులు అప్పీలు చేయాలి: స్పెషల్ పీపీ


రిషితేశ్వరి కేసు కొట్టివేయడంతో కోర్టు ఆవరణలో విలపిస్తున్న రిషితేశ్వరి తల్లి దుర్గాభాయ్, ఆమె పక్కన తండ్రి మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నగరంపాలెం: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ఆత్మహత్య కేసును కొట్టివేస్తూ గుంటూరు కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వరంగల్‌కు చెందిన రిషితేశ్వరి గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఏఎన్‌యూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) చదువుతూ, 2015 జూలై 14న బాలికల వసతిగృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ర్యాగింగ్, వేధింపులవల్లే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లిదండ్రులు అప్పట్లో పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, నిందితులపై మోపిన నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోవడంతో కేసును కొట్టేస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె. నీలిమా తీర్పు వెలువరించారు.

కేసు పూర్వాపరాలు..

నిజానికి.. రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థిని బలవన్మరణానికి కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాబురావుతో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమం చేశాయి. చంద్రబాబు నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు నాటి ప్రభుత్వం చేయని ప్రయత్నంలేదు. చివరికి.. ఈ పోరాటాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో ప్రిన్సిపాల్ జి. బాబురావుపై చర్యలు తీసుకుని, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో.. సుదీర్ఘకాలం విచారణ జరిగిన అనంతరం శుక్రవారం గుంటూరు కోర్టు కేసును కొట్టివేసింది. దీంతో.. తీర్పు వెలువడగానే రిషితేశ్వరి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

డైరీలను పట్టించుకోలేదు..

కోర్టు తీర్పుతో మా ఆశలు చచ్చిపోయాయి. మాకు పూడ్చలేని బాధను మిగిల్చారు. న్యాయం జరుగుతుందని తొమ్మిదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టేశామని చెప్పడం ఎంతో బాధగా ఉంది. మా కుమార్తె డైరీని స్వయంగా రాసింది. ఫోరెన్సిక్ ల్యాబ్ కూడా రిషితేశ్వరినే రాసిందని తేల్చిచెప్పింది. అయినా మా కుమార్తెకు అన్యాయం జరిగింది. ఇందులో 170 మంది సాక్షులున్నారు. కానీ, ఏ ఒక్కరూ వారికి కనిపించలేదు. మాకింక దిక్కెవరు? గంగలో దూకడమే శరణ్యం. పాప రాసిన డైరీలను ఎందుకు సాక్ష్యంగా తీసుకోలేదో అర్థంకావడంలేదు. గతంలో సీఎం చంద్రబాబు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీకి డైరీ కాపీలు అందజేసినా పరిగణలోకి తీసుకోలేదు. హైకోర్టుకు వెళ్లే విషయాన్ని ఆలోచిస్తాం.

– రిషితేశ్వరి తల్లిదండ్రులు దుర్గాభాయ్, మురళీకృష్ణ, రాజమండ్రి

కోర్టులో అన్నీ సమర్పించాం, అప్పీలుకు వెళ్లాలి..

రిషితేశ్వరి డైరీల్లో ఎవరెవరు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు, మానసికంగా వేధించిన వారి పేర్లు స్పష్టంగా ఉన్నాయి. అవన్నీ కోర్టు ముందున్నాయి. తోటి విద్యార్థులు, సీనియర్లు ఎలా వేధించారో కూడా అందులో స్పష్టంగా ఉంది. ప్రిన్సిపాల్ బాబురావుకు రిషితేశ్వరి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అప్పట్లో హాయ్‌ల్యాండ్‌లో జరిగిన స్పెషల్ పార్టీలో లైంగికంగా వేధించారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే నిందితులకు శిక్షపడుతుందని భావించాం. కానీ, కోర్టు కేసును కొట్టేసింది. ఈ తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం. పోలీసులు కూడా అప్పీల్ చేయాలి. – స్పెషల్ పీపీ వై. కోటేశ్వరరావు

గుండెఘోషకు రిషితేశ్వరి అక్షర రూపం ఇదే..

రిషితేశ్వరి ఆత్మహత్య తరువాత ఆమె గదిలో డైరీ లభించింది. అందులో రిషితేశ్వరి స్వహస్తాలతో రాసుకున్న కొన్ని ఘటనలు, తాను ఎదుర్కొన్న ఆవేదన, గుండెఘోషను కూలంకషంగా అక్షర రూపంలో వివరించింది. 'మై లాస్ట్ నోట్'పేరుతో తన స్వహస్తాలతో రిషితేశ్వరి రాసిన కొన్ని ముఖ్యాంశాలు ఏమిటంటే..

- నవ్వు!!! నవ్వు!!! నవ్వు!!! ఈ నవ్వు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నేను ఎప్పుడూ నవ్వుతూ ఉంటా. అందరిని నవ్విస్తూ ఉంటా. కానీ, ఆ నవ్వే నాకు పెద్ద సమస్య అయింది.
- మా నాన్న అంటే నాకు చాలా ఇష్టం. నిజానికి పిచ్చి. అంత ప్రేమగా పెంచాడు మా నాన్న. నాకు చదువు అంటే ఇష్టం. ఈ చదువు కోసం నా ఊరు వదిలి ఇక్కడకొచ్చా.
- ఇలా వచ్చిన నన్ను.. నా సీనియర్స్‌లో కొంత మంది చదువు వైపు కాకుండా ప్రేమవైపు లాగడానికి ప్రయత్నించారు. నేను ఆ దారిలోకి వెళ్లలేదు. దాంతో నా మీద రూమర్స్ క్రియేట్ చేశారు. అది వింటేనే నా మొహంలో నవ్వు మాయమై పోయేది.. ఏడుపు కూడా వచ్చేది.
- నేను నాన్న దగ్గర ఏమీ దాచేదాన్ని కాదు.. కాని ఇక్కడకు వచ్చాక చెబితే ఏమైపోతారో అని దాయాల్సి వస్తోంది. నాకు నరకయాతన కనిపిస్తోంది.
- నా ఆఖరి కోరిక ఒక్కటే. నా చావుకు కారణం ఎవరో వాళ్లకు తెలుసు. వాళ్ల వాళ్ల తప్పు తెలుసుకుంటే చాలు. ఇంకెవ్వరినీ ఇలా (నాలా) బాధపెట్టకుంటే చాలు.
- ఏ అమ్మాయిలూ యూనివర్సిటీలో ర్యాగింగ్ ఉండదని అనుకోవద్దు. ఏ తల్లిదండ్రులు పిల్లల్ని ఇంత ప్రేమగా పెంచవద్దు. మీకు చెప్పలేక వాళ్లలో వాళ్లు దాచుకోలేక నరకం కనిపిస్తుంది.
- అమ్మా, నాన్న జాగ్రత్త! నాన్న ప్లీజ్ ఏడవకండి. నేను ఎప్పుడూ మీ దగ్గర్లోనే ఉంటా. ట్రై టూ డొనేట్ మై ఆర్గాన్స్ ఇఫ్ దే ఆర్ ఇన్ గుడ్ కండీషన్.. (నా అవయవాలు పనిచేసే స్థితిలో ఉంటే వాటిని దానం చేయడానికి ప్రయత్నించండి) అంటూ చాలా అంశాలు రాసింది.

ఇది రెడ్ బుక్ పాలన

- ఏపీలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి
- కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో వైఎస్ జగన్ మండిపాటు
- సంక్రాంతి తర్వాత పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా జిల్లాల్లో పర్యటిస్తా
- 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో కార్యక్రమం



అబద్ధాలు చెప్పడం మనకు చేతగాదు. అతి నిజాయితీ, అతి మంచితనం మనకున్న సమస్యలు. కానీ రేపు మనమనుకుంటున్న ఈ సమస్యలే మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తాయి. ఆరు నెలలు తిరక్క మునుపే ఇవాళ పరిస్థితి చూస్తే.. ప్రతి ఇంట్లో ఒకటే చర్చ జరుగుతోంది. జగన్ కనీసం పలావు అయినా పెట్టేవాడు.. చంద్రబాబునాయుడు బిర్యానీ పెడతానన్నాడు.. తీరా చూస్తే పలావు పోయింది, బిర్యానీ పోయిందని చర్చ జరుగుతోంది. – వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఎక్కడ చూసినా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ప్రజలకు మంచి చేశాం కాబట్టి మాకు ఓటు వేయండి.. అని అడిగే పరిస్థితి టీడీపీకి లేదు. ఎక్కడ చూసినా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయిన పరిస్థితే కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'మన ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి మధ్య ఇప్పటికే ప్రతి ఇంట్లో పోలిక మొదలైంది. మన ప్రభుత్వ హయాంలో ఎలా ఉండేది.. ఈ ఆరు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఎలా పని చేస్తోంది.. అన్న చర్చ ప్రతి ఇంట్లో నడుస్తోంది' అని స్థానిక సంస్థల ప్రజానిధులకు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లతో సమావేశమయ్యారు. సంక్రాంతి తర్వాత పార్లమెంటు యూనిట్‌గా జిల్లాల బాట పడతానని, దాదాపు జనవరి ఆఖరు నుంచి 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెడతానని చెప్పారు. ప్రతి బుధవారం, గురువారం జిల్లాల్లోనే ఉంటానని, ప్రతి పార్లమెంటును ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడికి వచ్చి బస చేస్తానన్నారు. బుధవారం మూడు నియోజకవర్గాల కార్యకర్తలతో, గురువారం మరో నాలుగు నియోజకవర్గాల కార్యకర్తలతో మమేకం అవుతానని చెప్పారు. పూర్తిగా కార్యకర్తలకే సమయం కేటాయిస్తానని, అక్కడే ఉంటూ వారితో మమేకమవుతూ, వారికి తోడుగా ఉంటూ వారికి మరింత దగ్గరయ్యే కార్యక్రమం చేస్తానని తెలిపారు. ' గ్రామ స్థాయిలో కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రతి ఒక్కరికీ ఫేస్ బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ ఉండాలి. ఎక్కడ ఏ అన్యాయం జరిగినా దాన్ని వీడియో తీసి అప్ లోడ్ చేయాలి. యూట్యూబ్‌లో కూడా పోస్ట్ చేయాలి. సంవత్సరం పూర్తయ్యే సరికి గ్రామంలో తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును ప్రశ్నిస్తూ ప్రతి ఇంట్లోంచి వాయిస్ రావాలి. అది మనం చేస్తూ, మన కార్యకర్తలతో చేయించాలి. సూపర్ సిక్స్ ఏమైంది? ఏమైంది సూపర్ సెవన్? మాకు చెప్పిన మాటలు ఏమయ్యాయి? అన్న దగ్గర నుంచి మొదలయ్యే ప్రశ్నల వర్షం.. ఏమైంది మా స్కూల్? ఏమైంది మా హాస్పిటల్? ఏమైంది మా పంటల కొనుగోలు పరిస్థితి? ఏమైంది మా ఆర్బీకే? అంటూ ప్రశ్నల పరంపర కొనసాగాలి. ఆ దిశగా అడుగులు ముందుకు పడాలి' అని నిర్దేశించారు.

బాదుడే.. బాదుడు
ఇప్పుడు రూ. 9 వేల కోట్లు

- ఏపీ ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం మోపుతున్న చంద్రబాబు... ఇదికాక ఇప్పటికే ఈ నెల బిల్లు నుంచి రూ.6,072.86 కోట్లు వసూలు
- ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా వడ్డన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


జిల్లా వార్తలు

ఉషా టోర్నీకి ఎంపిక


క్రీడాకారులతో డీవైఎస్ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి 24వ సబ్ జూనియర్ బాలబాలికల ఉషూ టోర్నీకి ఖమ్మం జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఖమ్మంకు చెందిన టి.సాయిభవ్యశ్రీ, జె.ప్రహర్షన్ పాల్, డి.వరెన్, వై.రిత్విక్ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారని కోచ్, ఉషూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తెలిపారు. డిసెంబర్ 1నుంచి జరగనున్న టోర్నీకి ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం అభినందించారు.

జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి


సాయికిరణ్‌కు కిట్ అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. పాల్వంచ మండలం రేగళ్ల తండాకు చెందిన సాయికిరణ్ ఇటీవల మంచిర్యాల జిల్లా గాంధారిలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. దీంతో జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేశారు. ఈమేరకు సాయికిరణ్‌ను శుక్రవారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో అభినందించిన పీఓ రూ.10వే విలువైన హాకీ కిట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాలరావు, ఏఎస్ఓ నాగేశ్వరరావు, ఈఎంఆర్ఎస్ పీఈటీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ఐఆర్

ఖమ్మంగాంధీచౌక్: ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు ఐదు శాతం మధ్యంతర భృతి(ఐఆర్) అమలుచేస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 అక్టోబర్ 2న ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించగా, ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకూ ఐఆర్ అమలుచేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈసందర్భంగా ప్రభుత్వంతో పాటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, జీవన్, గవ్వ రవీందర్ రెడ్డికి హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్సు ఉత్సవాలకు వేళాయె..


దర్గాలో కొలువుదీరిన నాగుల్‌మీరా

- ముస్తాబైన నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా
- ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న సత్యనారాయణపురం
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన దర్గా ముఖద్వారం


నీతి వాక్యాలతో ఏర్పాటు చేసిన బోర్డులు

ఇల్లెందురూరల్: నమ్మిన భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా.. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఇల్లెందు మండలం సత్యనారాయణపురం శివారు హజ్రత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దర్గాలో శనివారం నుంచి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు తరలిరానుండగా.. దర్గా ముస్లింలకు పవిత్ర స్థలమైనా హిందువులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు.

22వ ఉర్సు ఉత్సవాలు

హజరత్ నాగుల్‌మీరా దర్గాలో ఇప్పటివరకు 21 సార్లు ఉర్సు ఉత్సవాలను నిర్వహించారు. ప్రస్తుతం 22వ ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాగుల్‌మీరాను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ నిర్వాహక కమిటీ ఆధ్వర్యాన పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

నాగుల పుట్ట

సత్యనారాయణపురం గ్రామం నుంచి రెండు కి.మీ. దూరంలో నాగుల్‌మీరా దర్గా ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో వచ్చే భక్తులకు అండగా ఉండేందుకు నాగుపాము తిరిగేదని భక్తులు చెబుతారు. హిందువుల ఆరాధ్య దైవ్యమైన నాగేంద్రుడిని ముస్లింలు కూడా పూజించడం విశేషం. నేటికీ ఈ ప్రాంతంలో నాగుపాము సంచరిస్తుందని భక్తుల విశ్వాసం. అంతేకాకుండా ఇక్కడకు వచ్చేవారు ప్రత్యేకంగా నాగేంద్రుడి పుట్ట వద్ద మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రశాంతత, సామరస్య స్ఫూర్తి..

దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్‌మీరా దర్గా ప్రాంగణం ప్రశాంతతకు నిలయంగా ఉంటుంది. దర్గా సమీపాన పెద్ద వృక్షాలతో పాటు దర్గా ప్రాంగణంలో రకరకాల పూల మొక్కలు, పక్షులు కనిపిస్తాయి. ఇక్కడ ఎలాంటి తాయెత్తులు అమ్మకపోగా, మంత్రించిన నీళ్ల చల్లడం, దర్శనానికి టికెట్లు అమ్మడం కనిపించవు. కానీ, నాగుల్‌మీర మహత్తుపై విశ్వాసం కలిగిన భక్తులు స్వచ్ఛందంగా వస్తు, ధన రూపేనా తోడ్పాటునందిస్తున్నారు. ప్రకృతి ఒడిలో మానసిక ప్రశాంతతను పొందే మార్గం చూపడమే ఈ దర్గా లక్ష్యంగా నిర్వాహకులు చెబుతున్నారు. ఇక్కడ సీతారాముల కల్యాణం, అయ్యప్ప ఇరుముడి, క్రిస్మస్ వంటి పర్వదినాలు నిర్వహిస్తుండటం మరోప్రత్యేకత. కాగా సత్యనారాయణపురం నుంచి దర్గా వరకు అడుగడుగునా మహనీయులు చెప్పిన నీతి వాక్యాలతో ఏర్పాటు చేసిన బోర్డులు కనిపిస్తాయి.

అన్ని సేవలూ భక్తుల బాధ్యతే..

హజ్రత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా భక్తుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. దర్గాలో సాధారణ కార్యక్రమాలు, అన్ని మతాల పండుగలను సమష్టిగా నిర్వహించే భక్తులు ఉర్సు ఉత్సవాలను కూడా అదే స్ఫూర్తితో కొనసాగిస్తారు. ఎక్కడా కూలీల అవసరం లేకుండా ఎవరి పర్యవేక్షణ కనిపించకుండా భక్తులే బాధ్యతతో ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. మహిళా భక్తులు సైతం రెండు, మూడు రోజులు దర్గాలోనే మకాం వేసి భక్తులకు అవసరమైన ప్రసాదం సిద్ధం చేస్తుంటారు.

దావత్, ప్రసాదం

దర్గాలో ఉర్సు ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులకు ఉర్సు ఉత్సవ కమిటీ తరఫున ప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తారు. అలాగే, చివరి రోజున వేలాది మంది భక్తులకు భోజనం సమకూరుస్తారు. ఎక్కడా ఎవరి నుంచి కూడా చందా అడగకుండా భక్తులు ఇచ్చే సాయంతోనే నిర్వాహకులు ఈ ఏర్పాట్లన్నీ చేస్తారు.

ఉర్సు ఉత్సవాల వివరాలివే..

- శనివారం (నవంబర్ 30) : సాయంత్రం 5 గంటలకు హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా నుంచి చాదర్ ప్రత్యేక వాహనంలో ప్రదర్శనగా బయలుదేరి నాగుల్‌మీరా దర్గాకు చేరుతుంది.
- ఆదివారం (డిసెంబర్ 1) : ఉదయం 9 గంటలకు హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా నుంచి భారీ జులూస్‌గా నాగుల్‌మీరా నిశానీలతో బయలుదేరి సాయంత్రం నాగుల్‌మీరా దర్గాకు చేరుస్తారు.
- సోమవారం (డిసెంబర్ 2) : మధ్యాహ్నం 12 గంటల నుంచి, సాయంత్రం 6 గంటలకు సలామీ, రాత్రి 7 గంటల నుంచి ఖవ్వాలీ నిర్వహిస్తారు.

సంస్థ పురోభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

పాల్వంచ: విద్యుత్ సంస్థల పురోభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఎన్నికైన తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ 7వ దశ కార్యవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. ఈసందర్భంగా 'ఏ' కాలనీలోని ఇంజనీర్ల అసోసియేషన్ హాల్ వద్ద మొక్కలు నాటిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఈ మాట్లాడారు. విభాగాల్లో సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు అసోసియేషన్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ట్రెజరర్ సంపత్‌తో పాటు బ్రహ్మాజీ, యాకూబ్, శ్రీకాంత్, మధుబాబు, రాజేష్, వెంకట్రావ్, అరుణ్ కుమార్, లక్ష్మీ, రాజేష్, నాగరాజు, గణేష్ పాల్గొన్నారు.


అసోసియేషన్ హాల్ వద్ద మొక్క నాటుతున్న సీఈ వెంకటేశ్వరరావు

వైభవంగా కార్తీక పూజలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో భక్తులు కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులకే కాకుండా వివధ ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజామునే గోదావరి తీరానికి తరలివచ్చి స్నానాలు ఆచరించారు. అనంతరం మహిళలు దొప్పలలో ఉసిరికాయలు ఉంచి దీపాలు వెలిగించి నదీ జలాల్లో వదిలారు. అంతేకాక తీరంలోని తులసి కొమ్మ నాటి దీపాలు వెలిగించారు. ఆ తర్వాత భద్రాచలం రామాలయంతో పాటు అనుబంధ ఆలయాలను సందర్శించి పూజలు చేయగా ఆలయాలు కిక్కిరిసిపోయాయి.

– భద్రాచలంటౌన్


గోదావరి నదిలో స్నానం చేస్తున్న భక్తులు


నదీతీరంలో దీపాలు వెలిగించి పూజ చేస్తున్న భక్తులు

పదోన్నతులు సరే.. బదిలీలెప్పుడు ?

- కేటీపీఎస్‌లో 70మందికి పదోన్నతి
- కొందరికి ఇక్కడి స్టేషన్ల పరిధిలోనే పోస్టింగ్
- మిగతా వారి బదిలీల్లో జాప్యంపై అనుమానాలు


పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: టీఎస్ జెన్‌కోలో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఇటీవల పదోన్నతులు కల్పించారు. అయితే, బదిలీలు మాత్రం చేపట్టడం లేదని పలువురు ఇంజనీర్లు వాపోతున్నారు. వాస్తవానికి పదోన్నతులతో పాటే బదిలీలు చేపట్టడం ఆనవాయితీ. కానీ ఈ సారి యాజమాన్యం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోస్టింగ్ కోసం ఇంజనీర్లు చేసే పైరవీల మాటున లాభపడాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పైరవీలకు దిగుతున్న వారిని పక్కన పెడితే మిగతా ఉద్యోగులకు పదోన్నతులు దక్కినా బదిలీ చేయకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

డీఈ కేడర్ వరకు ఇక్కడికక్కడే...

జెన్‌కో వ్యాప్తంగా గత అక్టోబర్ 14వ తేదీన 205 మంది ఇంజనీర్లకు పదోన్నతి కల్పించారు. వీరిలో ఏఈ నుండి ఎస్ఈ వరకు పలు కేడర్ల వారు ఉన్నారు. ఇందులో కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో 40 మంది, 7వ దశ కర్మాగారంలో 30 మంది వరకు పదోన్నతి దక్కింది. ఏఈలకు ఏడీఈలుగా, ఏడీఈలకు డీఈలుగా, డీఈలకు ఈఈలుగా, ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతులు కల్పించారు. ఇదిలా ఉండగా డీఈ కేడర్ వరకు ఇక్కడి స్టేషన్ల పరిధిలోనే ఖాళీలను భర్తీ చేస్తూ స్థానచలనం చేశారు. వీరు మినహా ఏఈ, ఏడీఈ స్థాయి ఇంజనీర్ల బదిలీలు మాత్రం చేపట్టడం లేదు.

పైరవీల బాట

డీఈ కేడర్ మినహా మిగతా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినా బదిలీల విషయంలో కారణాలు ఏమిటో తెలియకున్నా జాప్యం జరుగుతోంది. దీంతో ఆయా కేడర్లలోని కొందరు ఉద్యోగులు తమకు అనుకూలమైన పోస్టింగ్ దక్కించుకునేందుకు పైరవీల బాట పట్టారు. ఇలా పైరవీలతో వచ్చే వారి ద్వారా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఎప్పుడైనా పదోన్నతులతో పాటు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయడం ఆనవాయితీగా ఉండేది. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో ఆరోపణలకు బలం చేకూరుతుండగా, ఇంజనీర్లు, సంఘాలు నాయకులు మాత్రం త్వరగా బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని కోరుతున్నారు.